# త్యా గ రా జు

ఏ కాం కి క


**డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.**



**ప్రకాశకులు**

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్,

హైదరాబాదు - 500 084. ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

(Digitised 23 April 2026)

**Tyaga Raju**

(A Drama)

by **Dr.Nanduri Ramakrishnamacharya**

డిజిలిటీకరణ పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,
రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్
హైదరాబాద్ -500084.
Cell -9440495887.

Web Site : can down load digital copies at
nanduri.co.in

సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

# కృతిసమర్పణము

## మిత్రశ్రీ
## డాక్టర్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యంగారికి

*అంకితమగుత చిరస్నే*
*హాంకము స్వర్ణోత్సవోపహార స్రజమై*
*సంకలనముగా నా యే*
*కాంకికలు నవభువనవిజయాధ్యతునకున్.*

*రాజువుగావుగాని, నటరాజువు నాటకరంగమందు, ఉ*
*త్తేజమునం, దుదారగుణదీధితి, రాజసతీవియందు ఏ*
*రాజుకు తీసిపోవు; అనురక్తిని ఈ కృతి గొమ్మ, స్వర్ణ నీ*
*రాజన మంగళాశిష విరాజన జన్మదినోత్సవమ్మలో.*

*నీ మది చంద్రికా తరళ నిత్యవసంతమనోజ్ఞ నంద నా*
*రామము; దివ్యసౌరభ నిరంతర నాట్యకళాప్రఫుల్లమున్;*
*కోమలభావవీచికలకున్ గిలిగింతలు పెట్టు ఈ పూరా*
*రామము నీదు పేరున విరాజిలెడిన్ ప్రతిబింబసామ్యమై.*

# నివేదన

**I**

**"త్యాగరాజు"** ఏకాంకిక 'దశరూపకములు' సంపుటిలో ఒకటి. వీరాభిషేకం, త్యాగరాజు గద్య పద్య సంకలితాలు. మిగతా ఏకాంకికలలో జ్యోత్స్నాభి సారిక, గోదావరి సంగమం నృత్యనాటికలు. గీతకత్తిలో రెండే పాత్రలు. గీతకత్తి, ఉరికంబం, తమ్ముడు, పద్యంగాని పాటగాని లేని పోడిమాటల ప్రోగులు. మరణాంతకం వట్టి ప్రహసనం. ఈ ఏకాంకికలలో ప్రస్ఫుటంగా కనిపించే వైవిధ్యంలో రచయిత ఆత్మీయత వినా, ఏకత్వం మృగ్యం.

**II**

తెలుగుగడ్డ — అవహేళనరూపకం (Satire). ఈ అభూత కల్పన చదివిన దేశభక్తులకు రచయితపై కోపం రావచ్చు. వారిని రచయిత ఉమాభిత అర్థిస్తున్నాడు. కాని, ఒక మనవి. ఆత్మనిష్ఠ మైన అవహేళన ఆరోగ్యలక్షణం. అదిగాక తెలుగుగడ్డలో అవహేళనపూర్వకంగా భాసించే ప్రతి అక్షరం వెనుక రచయిత వేడి కన్నీటిబొట్లు మారువేషంలో దాగియున్నదని మరువవద్దు.

**III**

ఏ నాటకమైనా ఈ జగన్నాటకంలో అంతర్నాటకమే — అనే అనుభూతి పొందినవాడు జీవన్ముక్తుడే. జగన్నాటకాన్ని మించిన నాటకం ఏముంది కన్నుతెరచి చూడగల సహృదయునికి? వేరే నాటకాలు చదవటం ఎందుకు? ఆడటం ఎందుకు? వ్రాయటం ఎందుకు?

## IV

ఈ నాటికలు వ్రాసిన చిరకాలానికి ప్రచురించటానికి కారణం రచయిత కాదని మనవి. ఈ నాటికల రచనకు మిత్రశ్రీ డాక్టర్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యం ముఖ్య ప్రేరకుడు. రచనను ప్రోత్సహించి చేసిన తప్పుకు ముద్రణభారం వహించి, ప్రచురించటం నిష్కృతి కాబోలు.

## V

ఈ ఏకాంకికలు చదివి, ఎవరూ విలువగల తమ కాలాన్ని వెచ్చించవద్దని రచయిత హృదయపూర్వకమైన మనవి. ఒకవేళ పొరపాటున చదివినా ప్రదర్శించుటకు పూను కోవద్దని రచయిత సలహా. ప్రదర్శించేవారు తమకాలాన్నే గాక ప్రేక్షకుల అమూల్య కాలమునుగూడ దుర్వినియోగం చేసినవారవుతారని, అందుకు రచయిత ఎంతమాత్రమూ బాధ్యుడు కాదని హెచ్చరించుచున్నాను.

**నండూరి రామకృష్ణమాచార్య**

# త్యా గ రా జు

## భూమికలు:

1. త్యాగరాజు
2. శిష్యుడు_రామా రావు
3. శరభోజి మహారాజు
4. ఆస్తాన గాయకుడు
5. సేనా పతి
7. దొంగ

# త్యాగరాజు

**స్థలము:** శ్రీరంగ దేవాలయము - దేవాలయ ప్రాకార ప్రకరాంతరాలలోని ధ్వజ స్తంభ కింకిణీరావాలు – ఘంటికా నినాదాలు దూరదూరంగా వినిపిస్తూవుంటాయి - ఒక ప్రాత సత్ర ప్రాంగణము.

**ప్రవేశము:** శరభోజిమహారాజు - ఆస్థానగాయకుడు - సేనాపతి.

**ఆస్థానగాయకుడు:** మహాప్రభూ! తంజాపురీశుడు శరభోజి మహారాజ కాంచనమణి కిరీట కేయూరాది రాజలాంఛనాలు ఉజ్జగించి, రాజధాని వీడి, ప్రచ్ఛన్న వేషంతో పాదచారియై, ఈ రాత్రి ఈ తోటలో ఈ శ్రీరంగ దేవాలయసత్రప్రాంగణంలో ఒక గాయకుని అడుగుజాడలు వెదకి కొంటూ నిరీక్షించటం చూచి నిశాపురంధ్రి పులకాంకురప్రకారాలతో తారకాపుష్పాంజలి సమర్పిస్తోంది చూడు ప్రభూ!

**శరభోజి:** సంగీతసాహిత్యాలు మా ఆస్థానవాగ్గేయకారుల అమృతహృదయంచుట్టూ ఈ యుభయకావేరీ స్రవంతి కలవలె పెనవేసికొన్నాయి. ఏం చెయ్యాలి! ఆ మహాగాయకుని ఆహ్వానించి మన ఆస్థానంలో కనకాభిషేకం చెయ్యాలని అనుకున్నాను. కాని, ఆశ్చర్యం. మన ఆహ్వానం తిరస్కరింప గలిగాడు. అయితే, సేనాపతి! ఈ సత్రమేనా త్యాగరాజులవారి విడిది?

**సేనాపతి:** ఔను మహాప్రభూ! త్యాగరాజులవారు- అదుగో! దేవాలయంనుండి ఇక్కడికే వస్తున్నారు.

**శర:** ఈ మహానుభావుడు మన ఆస్థానంలోకి రాకపోయినా శ్రీరంగేశ్వరునిసన్నిధిలో పాడుతున్నప్పుడు వినేభాగ్యం కూడా నాకు పట్టలేదు. అంతమంది లోకి వెళితే ఎంత మారువేషంలో ఉన్నా ఎవరైనా గుర్తు పట్టవచ్చు.

**ఆ-గా:** మహాప్రభూ! ఆ వాగ్గేయకారుని పాట ఇప్పుడే ఇక్కడే వినవచ్చు. శ్రీ త్యాగరాజ పావనపాదసంస్పర్శచే శ్రీరంగ దేవాలయమే పవిత్రమైంది.

**శర:** మహాశయా! వినయసంపన్నమై అసూయావిరహితమైన మీ ప్రశంస మా కానందదాయకమైంది. శ్రీ త్యాగరాజ పాదస్పర్శ పవిత్రమైన దేవాలయముల నిక నేమిపవిత్రము చేయవలె? నాబోటి పతితుల పావనము చేయుటకు మన ఆస్థానమునకు రాకూడదా? ఎంతటి త్యాగరాజులవారికైనా ఇంతటి అహంభావమా! విద్యాలక్షణము వినయమే కదా?

**ఆ-గా:** మహారాజా! కనకాభిషేకంచేసే మహారాజులున్నప్పటి కీ భిక్షాటనం వరించిన త్యాగరాజే త్యాగరాజు. తన కనకాభిషేకం కాలదన్నిన భిక్షుకుని ఆగ్రహింపక అను గ్రహించి ఆర్ద్రహృదయంతో అతని కాలుదమ్ములు అర్చింప వచ్చిన శరభోజిమహారాజే మహారాజు.

**శర:** శ్రవణసుభగమైన ఈ అమృతగానం త్యాగయ్యదేనా?

**ఆ-గా:** అవును, భిక్షాపాత్రములో శిష్యులు అనుసరింపగా **తంబురాతీగలు మీటుకుంటూ ఆనందతన్మయత్వంతో ఇటే** వస్తున్నాడు జంగమ సంగీత దేవాలయం, త్యాగరాజు.

*త్యాగరాజు ప్రవేశం*

**రాజు వెడలె చూతము రారే**
**కస్తూరిరంగ రాజు వెడలె॥**

**తేజనిక్కి సామంత రాజులూడిగము సేయ**
**తేజరిల్లు నవరత్నపు దివ్యభూషణములిడి రంగ॥**

**కావేరీ తీరమునను పావనమగు రంగపురిని**
**శ్రీ వెలయు చిత్రవీధిలో వేడ్కగ రాగ**

**సేవను గని సురలు విరులచే ప్రేమను బూ జించగ**
**భావించి త్యాగరాజు పాడగ వైభోగరంగ॥**

**శర:** మహాభాగా! నమస్కారాలు.

**త్యాగ:** శ్రీరామార్పణమస్తు!

**ఆ-గా:** శ్రీ త్యాగరాజస్వాములవారికి దాసుని సాష్టాంగ దండప్రణామాలు.

**త్యా:** (లేగనెత్తి) శ్రీరామార్పణమస్తు! పుణ్యపురుషులారా! మీ రెవరు? ఈ దీనునిపై ఈ నిర్హేతుక జాయమానకరుణ ఎందులకు?

**శర:** ఈతడు మా తమ్ముడు - గాయకుడు - కవికూడా - తమ సాన్నిధ్యంలో భగవత్సంకీర్తనకైంకర్యం చేసుకోవాలని వచ్చాడు.

**త్యాగ:** అంతకంటె అదృష్టమా! మహాభాగా! ఆ కళ్యాణగుణ సంకీర్తన మీనోట విని తరించాలని ఉన్నది.

**ఆ-గా:** ఆర్యవచనము అనతిక్రమణీయము. అయినా నేనొక గాయకుడినా? శ్రీ త్యాగరాజులవారి గానం విని తరించాలని వచ్చిన నాకు పెద్దరిక ముందికదా అని ఈ ఆర్యుడు ఇట్టి ఇక్కట్టు తెచ్చిపెట్టాడు.

**త్యాగ:** వినయం విద్యాలక్షణం - మీ పాట వినిపించండి - తరువాత మీరడుగకుండానే నేనుకూడ సంకీర్తన చేస్తాను. ఎవరుచేసినా నాద బ్రహ్మోపాసన మేకదా!

**శర:** (ఆ. గా. తో.) ఈ జంగమ సంగీత దేవాలయ ప్రాంగణంలో పాడే అదృష్టం పట్టింది - ఇక ఉపక్రమించడం మంచిది.

**ఆ. గా:** మీ అనుశాసనం అనుల్లంఘనీయమేకదా!

**త్యాగ:** పాడండి.

**ఆ. గా:**

**జయ! జయ! త్యాగరాజ! జయ!**

**జంగమ గానకళాతరంగిణీ!**
**జయ! మహానీయ భక్తిరస**
**సంభృత విశ్వజనీనజీవనా!**
**జయ! జయ! దక్షిణాపథ**
**విశాలయశః పరివేష వైభవా!**
**జయ! జయ! నాదబిందులయ**
**సౌహృదభావుక పుంసరస్వతీ!**

**త్యాగ:** నిందకు సమాధానం చెప్పవచ్చు కాని ప్రశంస కెవరు సమాధానం చెప్పగలరు? మీ ఆదరానురాగాలకు తగిన అర్హత అనుగ్రహించమని ఆ పరాత్పరుని ప్రార్థిస్తున్నాను. ఏ పురుషుని ప్రశంసించడంకంటే ఆ పురుషోత్తమునికి కీర్తించడం మంచిది-సంకీర్తన ఆరంభించండి.

**ఆ. గా:**

**మధురానగరిలో చల్ల నమ్మబోదు**
**దారివిడువు కృష్ణా** **॥మ॥**
**మాపటివేళకు మరలి వచ్చెదను**
**పట్టకు కొంగు గట్టిగాను కృష్ణా** **॥మ॥**
**కొసరి కొసరి నా తో  సరసములాడకు**
**రాజమార్గమిది కృష్ణా! కృష్ణా** **॥మ॥**
**వ్రజవనితలు నను చేరగ వత్తురు**
**నిలువు నిలువు కృష్ణా! కృష్ణా** **॥మ॥**

**త్యాగ:** ఈ పాట వింటేనే ఇంత అద్భుతంగా ఉందే! అభినయించేటప్పుడు చూస్తే ఎంత అందంగా ఉంటుందో! కావ్యాలలో నాటకం రమ్యం, గేయాలలో పదం రమ్యం. అదీ కాక, ఈ 'మధురానగరిలో' అనే పాటలో తెనుగు నుడికారపు సొంపులు వంపులు తామరతంపరలు- ఈ ఒక్క పాటే ఒక మహా కావ్యం.

**ఆ. గా:** మహాభాగా!

**మా మధురాపురీ పద సమంచిత నాట్యకళా విదగ్ధ దే**

**ఖా మృదుగీతి తెన్గు నుడికారపు సొంపులు వంపులన్నియున్
తామర తంపరై తొగణికి తాండవ మాడుట నీవు మెచ్చినన్
కోమల దివ్యగాన రసకోవిద! మా జని ధన్యమయ్యెడున్.**

**పరమ భక్తి రూప వాగ్గేయకారక!
ఈ పదమ్ము బ్రతుక నిచ్చయున్న
అమరగానలోల! ఆనందభైరవి
రాగమందు పాట బ్రాయవలదు.**

**త్యాగ:** 'మధురానగరిలో' విన్నతర్వాత మళ్లీ ఆనంద భైరవిలో పాట బ్రాయడం ఎవరికైనా నా సాహసమే. పోని, మీ మాట ఎందుకు కాదనాలి! నేనుమాత్రం సాహసించనని శపథం చేస్తున్నాను - ఆహా! 'ముఖే ముఖే సరస్వతీ' అన్నారు పెద్దలు - ఎంత చక్కటి పాటలు వ్రాయగల సమర్థులున్నారో - ఆ వాగ్గేయకారులందరికీ నా జేజేలు!

*శ్రీరాగము - ఆదితాళము*

**ఎందరో మహానుభావులు
అందరికి వందనములు ॥ఎం॥**

**చందురువర్ణుని యంద
చందమును హృదయారా
విందమున జాచి బ్రహ్మా
నందమనుభవించువా ॥ఎం॥**

**సామగానలోల మనసిజ
లావణ్యధన్య మూర్ధన్య
మానసవన చరవర సం
చారము నిలిపి మూర్తి
బాగుగ పొడగనే వా ॥ఎం॥**

**త్యాగరాజు
సరగున పాదములకు**

**స్వాంతమను సరోజమును**
**సమర్పణము సేయువా** **॥రం॥**
**పతిత పావనుడనే పరాత్పరునిగురించి**
**పరమార్థమగు నిజమార్గముతోను బాడుచు**
**సల్లాపముతో స్వరలయాదిరాగము**
**తెలియువా** **॥రం॥**

**ఆ. గా:** మహాభాగా! నా జన్మ తరించింది.

**శర:** శరభోజిమహారాజుకుకూడా పట్టని మహా అదృష్టం ఈ గాయకుడికి పట్టింది, ఇతడు మిమ్మల్ని పాడించగలిగాడు.

**ఆ. గా:** శరభోజిమహారాజుగారి కనకాభిషేకంకూడా మీ నోట పాట ఊరించలేదు. నా యీ చిరుపాట ఒక మహాకృతికి భవ్యకవితావేశం కల్పించిన ప్రావేశికీ ధ్రువాగానమైనది. అది నా అదృష్టమే!

**శర:** మహాశయా! ఇంతటి వినయ సంపన్నులే - శరభోజి మహారాజు ఆహ్వానం ఎందుకు తిరస్కరించారో తెలుసుకో వచ్చునా?

**త్యాగ:** నాయనా! కారణం వేరే ఏమీ లేదు.

*కళ్యాణి - చాపు*

**నిధి చాల సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా?**
**నిజముగ బల్కు మనసా** **॥ని॥**

**దధి నవనీత క్షీరములు రుచియో?**
**దాశరథి ధ్యానభజన సుధారసము రుచియో?** **॥ని॥**

**త్యాగరాజు**
**దమశమమను గంగాస్నానము సుఖమా?**
**కర్దమ దుర్విషయకూపస్నానము సుఖమా?** **॥ని॥**

**మమత బంధనయుత నరస్తుతి సుఖమా?**
**సుమతి త్యాగరాజనుతుని కీర్తన సుఖమా?** **॥ని॥**

**శర:** అంతేనా! ఆ మహారాజు క్రూరుడు, దుర్మార్గుడు అని మీరు విన లేదుకదా?

**త్యాగ:** నాయనా! ఆ పరాత్పరుడు పతితపావనుడు. తారకరాముడు దయామయుడు - తోడి మానవులను క్రూరులని, పాపులని నిందించడం ఆ విశ్వశిల్పినే నిందించడం - నేను భిక్షుక గాయకుడిని. భిక్షాటనానికి బదులు కనకాభిషేకం మెందుకు నాకు? అదీకాక మహారాజ ఆస్థాన గాయకుడు మహావిద్వాంసుడని విన్నాను. అటువంటి మహావిద్వాంసులముందా నాకు కనకాభిషేకం?

**శర:** అయితే-మా భితోటవందనాలనైనా నా స్వీకరించండి-

**త్యాగ:** రామరాయ! ఏది నా భిక్షాపాత్ర?

**రామ:** ఇదిగో!

**త్యాగ:** భవతి భిక్షం దేహి!

**శర:** (సేనాపతితో) ఈ మహానుభావునికి భిక్షావందనాలు సమర్పించు - బియ్యం నీసంచిలోనే ఉన్నాయిగదా!

**సేనా:** ఇదిగో! మహానుభావా! మా భిక్షావందనాలు స్వీక రింప ప్రార్థన.

*(బియ్యం సువర్ణనాణెములు కలిపి పోయును.)*

**త్యాగ:** (అవి నేలమీద పారబోయును.)

**సేనా:** అయ్యో! ఈ మహాభాగుడు భక్తితో సమర్పించిన బియ్యం బంగారు నాణెములతోసహా నేలమీద పారబోసినాడే!

**రామ:** మా గురువుగారు కామించీ కాంచన విదూరులు.

**త్యాగ:** బంగారునాణెముల సహవాస సంపర్కంవల్ల ఈ బియ్యంకూడా అపవిత్రమయిపోయినాయి నాయనా!

**శర:** మహాభాగా! క్షమించాలి. మావాడు తెలియక తప్పుచేశాడు. ఇదిగో! ఈ శ్రీరామపంచాయతన విగ్రహం-తమ ఇష్టదైవమని ఎరిగి, కోరి, ముచ్చటపడి తమకు సమర్పించాలని తీసికొనివచ్చాను. ఇది విగ్రహమాత్రమే. భక్తిరూపమున ఎంచి పరిగ్రహింప ప్రార్థన.

**త్యాగ:** ఆహా! ఈ తీర్థయాత్రలు సేవించటానికి బయలుదేరేటప్పుడు మా అర్ధాంగి కైంకర్యము అనుభవించమని వదలి వచ్చేశాను-నన్ను వదలిపెట్టలేక నాదగ్గరకే నడచి వచ్చినావా! ఒకనాడు మా అన్నయ్యగారు జప్యేశుని చేతిలోనుంచి కావేరీలోకిజారి తిరిగి నాకు స్వామి సందర్శనం అనుగ్రహించినప్పుడు పాడుకున్నాను-తిరిగి నన్ను వదలలేక నా పాలికి వచ్చిన నా స్వామినిగూర్చి పాడుకుంటాను.

**కనుగొంటిని శ్రీరాముని నేడు ॥క॥**
**ఇనకులమందు ఇంపుగాను బుట్టి**
**ఇలలోన సీతానాయకుని నేడు ॥క॥**
**భరత లక్ష్మణ శత్రుఘ్నులు కొలువ**
**పవమానసుతుడు పాదములుబట్ట**
**ధీరులైన సుగ్రీవప్రముఖులు**
**వినుతిసేయ త్యాగరాజనుతుని నేడు ॥క॥**

**శర:** ధన్యోస్మి-ధన్యోస్మి-పరోక్షముగానైన శరభోజి మహారాజు కూడ ఈ కృతికి కారకుడైన ధన్యాత్ముడేకదా! మహాభాగా! తమకు భోజన వేళ అతిక్రమిస్తున్నట్లున్నది. సెలవు, తలుపులు వేసికొనుడు-సెలవు.

**త్యాగ:** ఈపూట భోజనము చేయను, ఇంటితలుపులు మాసికోని నిద్రించి ఇరవై ఏళ్ళయింది. మీకు కాలాతీతం అయినట్లున్నది, సెలవు.

**ఆ. గా:**

**నమో నమో శ్రీ త్యాగరాజాయ**
**నమో నమో**
**గానకళాస్వరూపాయ**
**నమో నమో**
**నాదపరబ్రహ్మమూర్తయే**
**నమో నమో**
**నిత్యానంద నిరంజనాయ**
**నమో నమో**
**శ్రీ త్యాగరాజాయ నమో నమో.**

*ముగ్గురు నిష్క్రమిస్తారు.*

**త్యాగ:** (భాగవతంనుంచి గజేంద్రమోక్షణ ఘట్టం చదువుతూంటాడు.)

*దొంగ ప్రవేశం*

**లా వొక్కింతయు లేదు, ధైర్యము**
**విలోలంబయ్యె, ప్రాణంబులు**
**ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చె,**
**తనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడిన్,**
**నీవే తప్ప నితఃపరం బెరుగ,**
**మన్నింపందగున్ దీనునిన్,**
**రావే! ఈశ్వర! కావవే! వరద!**
**సంరక్షింపు భద్రాత్మకా!**

**దొంగ:** ఆఁ, వచ్చాను.

**త్యాగ:** ఆఁ, తండ్రీ! రా!

**దొంగ:** అరవకూ-అరిచావా చూడు ఈ కత్తి-ప్రాణాలుండవు, జాగ్రత్త-ఈ సత్రంలో ఇంకెవరూ లేరు-ఈ తోటలోంచి కేక అంతసులభంగా ఇంకెవరికీ వినిపించదు.

**త్యాగ:** నేను గజేంద్రమోక్షం చదువుకుంటున్నాను. అరవటం ఎందుకు? రా నాయనా నీవుకూడా!

**దొంగ:** ఆకలి-ఆకలి-నా కాకలి వేస్తోంది. నా కడుపుచిచ్చు ఏమనుకుంటున్నావో! ఈ భూలోకమంతా దహించి వేయగలదు.

**త్యాగ:** అవును - నాయనా! భగవంతుడుకూడ ఆకలి యున్నవారికి అన్నరూపంలోతప్ప సాక్షాత్కరింప లేడు-ఆగు-వెళ్ళిపోకు-మా రామారావును పిలుస్తాను. ఆకలి తీరుతుంది.

**దొంగ:** అతన్ని పిలుస్తావా! నిన్న ఎట్లాన మెచ్చి!

**త్యాగ:** ఏం, నేను చెపుతున్నాను చాలదా?

**దొంగ:** సరే! కడుపుకక్కుర్తి ! పిలు.

**త్యాగ:** రామారావు!

*రామారావు ప్రవేశించి కొయ్యపారిపోతాడు*

**దొంగ:** ఇదిగో! అల్లరి చేశావంటే ఇదికత్తి. వెయ్యినరకాలు ఘోషించినా సూటిగా మీ గుండెల్లో గుచ్చుతాను.

**త్యాగ:** నాయనా! మాపాడు దేహాలకేం-నీ అంత రాత్మ వినాశానికే నావిచారం. అదీగాక, నీవంటి అన్నార్తునికి అపచారం చేస్తామా! రామారావ్! ఈ అభ్యాగతి స్వయం విష్ణువు. మన అదృష్టం పండింది. వెంటనే విస్తరివేయి.

**రామా:** ఈ రాత్రి మీరు ఉపవాసమున్నారు కదా! వండలేదు.

**త్యాగ:** అయితే, పాలు పండ్లు ఏమీలేవా!

**రామా:** మీ వంతుఉన్నాయి.

**త్యాగ:** ఇట్లా తీసికొనిరా.

**రామా:** (తెచ్చి) నాకు భయం వేస్తోంది. ఈ కత్తేమిటి? ఇతనివాలకం ఏమిటి? అదిగాక, మీకోసముంచిన పాలు పండ్లు........

**త్యాగ:** (అందుకొని దొంగకు వడ్డిస్తాడు.)

**దొంగ:** (తింటూ) అయితే, మహాభక్తుల ఉపవాసమే భోజనం కంటే దండిగా ఉంటుందన్న మాట!

**రామా:** కళ్ళుపోతాయి నీచుడా! ఎవరనుకుంటున్నావు నీ ఎదురుగుండా ఉన్నది!

**త్యాగ:** రామారావ్! అభ్యాగతి సాక్షాద్విష్ణుదేవుడు. ఈతన్ని ఏమన్నా అనవచ్చా - పక్కగదిలోకిపోయి పడుకో.

**రామా:** మిమ్మల్ని వదిలిపెట్టే!

**త్యాగ:** ఆ పరాత్పరుడే అందరికి రక్షకుడు, పోయి పడుకో- తెలిసిందా-ఒకర్ని ఇంకొకరు రక్షింపలేరు. ఈ పుణ్యపురుషునితో కొంచెం మాట్లాడాలి.

*రామారావు నిష్క్రమణ*

**దొంగ:** నే నె వర్నో మీకు నిజం తెలిస్తే మీరిట్లా మాట్లాడరు.

**త్యాగ:** కొంచెం తెలుసుకున్నాను. దురదృష్టవంతుడివి కాబోలు. పాపం చాలా కష్టాలనుభవించి బండకత్తి ఈ విధముగా మొండిబారిపోయుండాలి.

**దొంగ:** మీఊహ నిజమే. అప్పుడు నేనుకూడ ఒక మనిషినే! ఇప్పుడు నేను ఒక మృగాన్ని, పెద్దపులిని, సింహాన్ని, రాక్షసుణ్ణి, యమధర్మరాజును.

**త్యాగ:** ఇట్లా ఎందుకు తయారయ్యావు నాయనా!

**దొంగ:** ఏం! రాజభటులకు చెప్పటానికా?

**త్యాగ:** చెప్పను.

**దొంగ:** అయితే వినండి. మొట్టమొదట నాభార్య-అవును, నా భార్యకు జబ్బుచేసింది. నెలరోజులు మంచముమీదే- ఇల్లు గుల్లయిపోయింది. ఒకచోట దొంగతనం చేయటానికి వెళ్లాను, పట్టుబడ్డాను. అంతే, ఖైదులోపెట్టారు. ఆనాడే ఆమె చచ్చిఉండాలి. నాలుగేళ్లయింది. ఈ వేళ చెరసాలనుంచి తప్పించుకొని పారిపోయి రాగలిగాను. కాని, ఏం లాభం! ఆకలి! ఆకలి! చెరసాలలోఉంటే ఆకలిమాత్రం ఉండదు. ఇప్పుడు నాకు స్వేచ్ఛ వచ్చింది. కాని, ఎందుకీ స్వేచ్ఛ? ఆకలితో మలమలమాడటానికేనా! ఆ ఆకలే ఈ కత్తి పట్టించింది.

**త్యాగ:** అవును నాయనా! స్వతఃసిద్ధంగా ఏ మానవుడు రాక్షసుడుగా మారిపోవాలని కోరుకుంటాడు? ఇప్పుడైనా మించిపోలేదు. తరుణోపాయం.

**దొంగ:** నాకు తరుణోపాయమా! ఇప్పుడైనా మించిపోయింది లేదా?

**త్యాగ:** నాయనా! నీకు ఆకలి తీరిందా?

**దొంగ:** ఆబాధ తీరింది.

**త్యాగ:** అవును నాయనా! నీవు కడుపునిండా తిని గ్రుమని త్రేన్చిస్తే ఆ త్రేన్పులో నాకు పరమేశ్వర సాక్షాత్కారం లభించింది. నీవు సాక్షాద్విష్ణుమూర్తివి తండ్రీ! కడుపు నిండా తిండిమాత్రమే కాదు. కళ్లనిండా నిద్ర-కాళ్లనిండా బట్ట-ప్రతిమానవునికి అవసరం. దారిద్ర్యం పుణ్యమూర్తుల్నెం దర్నో పతితుల్ని చేస్తుంది-కాని, భోగ భాగ్యాలు దారిద్ర్యం కంటేకూడా మానవుల్ని మరింత పాడుచేస్తాయి. ఇదిగో! నీ బట్టలు బాగాలేవు. ఈ ఉత్తరీయం కట్టుకొని, ఈ చాపమీద పడుకో-చాలా రోజుల్నుంచి నీకు సుఖనిద్ర ఉండి ఉండదు.

**దొంగ:** ఎవరయినావస్తే?

**త్యాగ:** నా బంధువు అని చెపుతాను. పడుకో-నా మాటలో దుప్పటి ఉంది. నీవు కప్పుకోనేందుకు తెచ్చియిస్తాను.

**దొంగ:** (బంగారు నాణెములు ఏరుకొని బొడ్డులో దోపికొని, శ్రీరామ పంచాయతన విగ్రహంకూడ పట్టుకొంటాడు.)

**త్యాగ:** (దుప్పటి తెచ్చి) ఓహో! బంగారు నాణెములు వెతుకున్నావా? మంచిపని చేశావునాయనా! తెల్లవారిన తరవాత తుడిచి పెంటకుప్పపై పారవేసేబాధ తప్పించావు. ఏం! విగ్రహం బాగుందా?

**దొంగ:** ఆఁ, అందుకే చూస్తున్నాను.

**త్యాగ:** మా కోదండరాముడు ఎవరిని ఆకర్షింపడోయ్! ఇందాకా ఒక పుణ్యపురుషుడు ఇస్తే మా కోదండరాముడు నన్ను వీడలేక వచ్చాడని పుచ్చుకున్నాను. ఇది విగ్రహమేకదా అని ఇచ్చాడు. కాని నాపాలిటి పరంధాముడే కోదండరాముడు.

**దొంగ:** ఇది విగ్రహంమాత్రం ఏమిటి? ఈ రత్నకిరీటం, మణులు కరిగిస్తే కొన్ని వేలు విలువైనవి.

**త్యాగ:** ఆఁ, మా కోదండరామునికి ఎవరు విలువకట్టడం! పడుకోనాయనా! పడుకో!

*త్యాగరాజు పడుకుంటాడు - దొంగ విగ్రహంతో నిష్క్రమిస్తాడు.*

**రామా:** (ప్రవేశించి) అయ్యో! అయ్యో! దొంగ విగ్రహం ఎత్తుకొనిపోతున్నాడు.

**త్యాగ:** (లేచి) ఏమి! మన కోదండరాముడు వెళ్లిపోయాడా?

**రామా:** గురువుగారూ! ఆ దొంగను.....

**త్యాగ:** అవును. నాదే తప్పు. కాంచన మణిస్థగితమైన ఆ విగ్రహంతో అతన్ని లోభపెట్టాను. అసలు మొదట పుచ్చుకోవడం నాదే పొరపాటు. భగవంతుడు ఈ బోధ చేయటానికే ఈ అభ్యాగతిరూపంలో వచ్చాడు.

**రామా:** రాజభటులతో చెప్పి...

**త్యాగ:** అదేమిటి నాయనా! తిరిగి అతన్ని ఆ నరకకూపంలో మన చేతులారా తోయించడమా!

*దొంగను పట్టుకొని శరభోజీమహారాజు, సేనాపతి, ఆస్థాన గాయకుడు ప్రవేశం*

**శర:** ఈ దొంగ మీకు మేము సమర్పించుకున్న విగ్రహం తస్కరించి...

**త్యాగ:** అయ్యో! ఎవరు చెప్పారు! ఇతడు నా బంధువని నేనే ఇచ్చాను.

**శర:** మీరే ఇచ్చేరా ఈ విగ్రహం!

**త్యాగ:** ఏల! విగ్రహం ఇవ్వటానికి నాకు అధికారంలేదా?

**శర:** లేకేం! చాలా విలువైంది-తెలియదేమో అని అన్నాను.

**త్యాగ:** అంతవిలువైనదని తెలిసే ఇచ్చాను.

**రామా:** దొంగవైభవ, నీకు పాలు, ఫలహారాలు కుత్తుక నిండేటట్లు పొట్టలో కూరి కూరి మెక్కపెడితే, పవళింపు సేవచేయిస్తే, కృతఘ్నుడవై విగ్రహం తస్కరించి పారిపోతున్నావా?

**దొంగ:** వీళ్లేదో నన్ను పట్టుకున్నారనుకుంటున్నారా? ఆ కోదండరాముడు వెయ్యి బాకాలతో ఎదురుపడినట్లయింది. ఆ రఘురాముడే, ఆ తారకరాముడే ఈ మహాత్ముని పాదాలు చూపించాడు, కదలలేకపోయాను. వీళ్లకు దొరికాననుకుంటు న్నారు. మహానుభావా! రక్షించు!

*త్యాగరాజు కాళ్లపై పడును.*

**త్యాగ:** నాయనా! నీవు అదృష్టవంతుడివి-కోదండరాముడు కరుణించాడు. భయపడకు, లే.

**దొంగ:** మహానుభావా! నేను తిరిగి చెరసాలకుపోయి పట్టుపడదలచుకున్నాను. రామదాసు అక్కడ ముక్తిపొంద లేదా?

**త్యాగ:** నాయనా! ఈ విగ్రహంకూడా తీసికొనిపోయి ఆరాధించుకో, రామభక్తులకు నరకంకూడా స్వర్గమే!

**దొంగ:** నాకు తారకమంత్రోపదేశం చేసి రక్షించు మహాను భావా!

*అని కాళ్లు పట్టుకుంటాడు.*

**త్యాగ:** (చెవిలో తారకమంత్రోపదేశం చేస్తాడు.)

**దొంగ:** నా కేమి సెలవు?

**త్యాగ:** నాయనా! నే నేమి చేయగలను? పశ్చాత్తాపం ఎంత పాపాన్నయినా హరించివేయగలదు. కాని, నీ శిక్ష్య తీసివేయడానికి నే నేమయినా శరభోజిమహారాజునా?

**శర:** మహాభాగా! ఇదిగో దాసుడు శరభోజి-మీ ఆజ్ఞానుసారం ఇతని శిక్ష రద్దు చేస్తున్నాను.

**త్యాగ:** ఆఁ (దొంగతో) నాయనా! ఈ బంగారు నాణెములు మూలధనంగా నీ జీవితం తిరిగి ప్రారంభించు.

ఈ శ్రీరామ పంచాయతనవిగ్రహం నీకూ నీ గురుదేవుని కానుక-మరచిపోకు.

**శర:** మహాభాగా! క్షమించు-కాంచనంమీద మమకారం పోక తపిస్తూ అన్నమాటలవి. మణికిరీటం మీ చేతి గడ్డి పోచ అని ఇప్పుడు ప్రత్యక్షంగా తెలిసికున్నాను. ఇంత అంతవిలువైన విగ్రహం అతని కిచ్చినందుకు మాత్సర్యం పడటం లేదు.

**త్యాగ:** నాయనా! ప్రతిమానవుని హృదయంలో ఒక దివ్యదేవాలయం ఉన్నది. అది చాలదా? ఎందుకు రజత మణిస్థగిత విగ్రహం?

**శర:** మీ శాంతం, నిగ్రహం నన్ను వివశుణ్ణి చేశాయి.

**త్యాగ:**

**శాంతము లేక సౌఖ్యము లేదు**
**సారస దళ నయనా**
**దాంతునికైనా, వేదాంతునికైనా ॥శాం॥**

**దారసుతులు ధన ధాన్యము లుండిన**
**సారెకు జప తప సంపద గలిగిన ॥శాం॥**

**ఆగమశాస్త్రము లన్నియు జదివిన**
**భాగవతులనుచు బాగుగ పేరైన ॥శాం॥**

**రాజాధిరాజ శ్రీరాఘవ త్యాగ**
**రాజనుత సాధురక్షకతను కృప ॥శాం॥**

**శర:** ఆ మహాశయుడు మా ఆస్థానగాయకుడు.

**త్యాగ:** ఆస్థానగాయకత్వము నా కింతవరకు కనిపించలేదు కాని వాగ్గేయకారకత్వము నా కిదివరకే ప్రస్ఫుటమైనది.

**ఆ-గా:** ఎంతటిమాట - మారువేషముతో వచ్చిన మా అవజ్ఞ మన్నింపప్రార్ధన.

**శర:** ఒక్క ప్రార్ధన. మీ గానవిద్య మా ఆస్థాన గాయకులకు సంపూర్ణముగా అనుగ్రహింప వేడికోలు.

**త్యాగ:** మహారాజా! న్యాయందేమున్నది? గానవిద్యలో మీ ఆస్థానగాయకులు నాకంటే తక్కువవారా?

**ఆ-గా:** శ్రీ త్యాగరాయలవారి విద్య నాకు సంపూర్ణముగా అబ్బుట వేయిజన్మల శుశ్రూష చేసినా అసంభవం.

**శర:** ఏం? ఆ మహాత్ముడు అనుగ్రహిస్తే.

**ఆ-గా:** అసంభవం. వేలినవారి ఆగ్రహింపకుండాపుంటే.

**శర:** ఆగ్రహం ఎందుకు? చెప్పండి.

**ఆ-గా:**

**వేను తంజాపురీశు మెప్పింపగోరి**
**పాడుచుంటి సంసార తాపంబుతోడ**
**తాంబురా తీగ మీటు శ్రీ త్యాగరాజ**
**ప్రేమతో జగదీశు మెప్పింపగోరి.**

**శర:** చక్కగా చెప్పారు; నిజమే.

**త్యాగ:** అట్లయిన ఆ జగదీశ్వరుడందరికీ సులభుడే, జగదీశుని కీర్తించిన అమరగానమే కాదు – మోక్ష సామ్రాజ్యము కూడా మనకు వివృతద్వారముతో రూక్పర నిరాజనాలు సమర్పిస్తుంది.

*అఠాణా - ఆది*

**ఏల నీదయరాదు?- పరాకు చేసెద-**
**వేళ సమయముగాదు?**

**బాల! కనకమయచేల! సుజనపరి**
**పాల! శ్రీ రమాలోల! విభృతకర**
**జాల! శుభద! కరుణాలవాల! ఘన**
**నీల! నవ్యవనమాలికాభరణ!** ॥ఏల॥

**రారా! దేవాధిదేవ!**
**రారా! మహానుభావ!**
**రారా! రాజీవనేత్రా!**
**రఘువర పుత్రా!**

**నాగశయన! వరనాగవరద! పు**
**న్నాగ సుమధర! సదాఘమోచన స**
**దాగతిజధృతప దాగమాంతచర!**
**రాగరహిత! శ్రీ త్యాగరాజనుత!** ॥ఏల॥

*[తెర]*